
# సరిహద్దులు

- సి.ఎస్.లలిత




ఆకాశం వర్షిస్తోంది... 'నా హృదయంలా! ఉదయం నుండి ఎడతెగని వర్షం. సాయంత్రం సమయాల్లో బాల్కనీలో నిలబడి 'చికాగో' నగర అందాల్ని వీక్షించడం నా అలవాటు. అయితే ప్రతిరోజుకీ, ఈ రోజుకీ చాలా తేడా వుంది. ఏ నిర్ణయం తీసుకోవాలో తెలియని సందిగ్ధంతో నా మనసంతా అసహనంగా ఉంది. ఇలాంటి సమస్య ఎదురవుతుందని ముందే నాకు తెలుసు. తెలిసి కూడా కొన్ని బలహీనతలకు లోబడటం మానవ సహజం అనుకుంటా!


గాలివాటుకు చిరుజల్లు ముఖంమీదికి రావడంతో వెనుదిరిగి ఇంట్లోకి నడిచాను. టేబుల్‌పై ఉన్న ఉత్తరం నా సంగతి ఏమిటన్నట్లు, గాలికి రెపరెపలాడింది. 'డాడీ' ఈ పాటికి ఇండియాలో లాండ్ అయివుంటారు. ఆ నేల, ఆ గాలి తాకగానే పరవశించిపోతారు.

మదిని మరలా ఆలోచనలు ముసురుకున్నాయి. 'రెహమాన్'తో పరిచయం నా కనుల ముందు మెదిలింది.

మేనేజర్‌తో పాటు ఓ అందమైన యువకుడు నా గదిలోకి ఎంటర్ కావడంతో 'డేటా' ఫీడ్ చేస్తున్న నేను ఏమిటన్నట్లు చూశాను. మిస్ భారతీ! ఇతను మన కంపెనీలో జాయిన్ అయిన హార్డ్‌వేర్ ఇంజనీర్. పేరు రహమాన్. రేపటినుండీ డ్యూటీలోకి వస్తారు అని రెహమాన్‌ని నాకు పరిచయం చేశారు మేనేజర్. 'హాయ్' అని చిరునవ్వుతో పలకరించాడు అతను. ఆ కనుల్లోని మెరుపును, నవ్వులోని ఆకర్షణను చూస్తూ 'హాయ్' అని బదులిచ్చాను నేను.

దాదాపు ఆరడుగుల ఎత్తు. ఎత్తుకు తగిన పర్సనాలిటీ. తెల్లని దేహచ్ఛాయ, చురుకైన కళ్ళు. చూడగానే ఆకట్టుకునే రూపం అతనిది. వయసు ఇరవై ఎనిమిది ఉండవచ్చు. ఆకర్షణీయమైన రూపం కావడంతో నా గదిలో నుంచి బయటికి వెళ్ళబోతున్న అతన్ని మరోసారి చూశాను. గుమ్మం దాటబోతూ అదే సమయంలో అతను కూడా వెనుతిరిగి నా వైపు చూశాడు. తడబాటుగా కంప్యూటర్ స్క్రీన్‌వైపు నా దృష్టిని మరల్చాను నేను. అతను నా తడబాటు చూసి చిన్నగా నవ్వడం నా చూపుని దాటిపోలేదు.

వారం రోజుల తర్వాత అనుకుంటా! లంచ్ అవర్‌లో తన టేబుల్‌పై కూర్చుని ఏదో



## అభిషేక్ లక్!

అభిషేక్ లవ్ లైఫ్ సక్సెస్ అవుతుందో లేదో గానీ సినిమా కెరీర్ మాత్రం బాగానే ఉంటుందనే టాక్ బాలీవుడ్‌లో బలంగా వినిపిస్తోంది. సూరజ్ బరజాత్య చిత్రం 'మై ప్రేమ్‌కి దివానీ'లో అభిషేక్ కోస్టార్స్‌గా హృతిక్, కరీనా నటించారు. మరొక చిత్రం 'ముంబయి సే ఆయా మేరా దోస్త్' ఈ రెండు చిత్రాలపై అభిషేక్ ఆశలు పెట్టుకున్నాడు. అభిషేక్ లక్ ఎలా ఉందో ఈ రెండు చిత్రాలు రిలీజ్ అయితే గానీ తెలీదు.

రాసుకుంటున్నాడు. అతన్ని దాటి వెళుతూ యథాలాపంగా "ఏం రాస్తున్నారు?" అని అడిగాను. చిన్నగా నవ్వుతూ 'కవిత' అన్నాడు.

"మీరు కవితలు రాస్తారా?" అని ప్రశ్నించాను. "సమయం దొరికినపుడు, మదిలో భావాలు మెదిలినపుడు రాస్తుంటాను" అన్నాడు. ఆసక్తిగా అతను రాసే పేపర్‌లోకి చూశాను. పొందికగా ఉన్న ఉర్దూ అక్షరాలు. "హిందీలోకి ట్రాన్స్‌లేట్ చేసి చెబుతారా" అని అడిగాను.

'ప్యార్' అని పది పంక్తుల కవితను హిందీలోకి తర్జుమా చేసి వినిపించాడు. "ఎండింగ్ ఎక్సలెంట్‌గా ఉంది" అని మెచ్చుకున్నాను నేను. "అవును... ఈ కవిత చాలా రోజుల క్రితం రాసింది. ఎండింగ్ నాలుగు లైన్లు కుదరక అసంపూర్తిగా వుంచాను. ఈ రోజే వచ్చిన థాట్‌తో కంప్లీట్ చేశాను" ఆనందంగా చెప్పాడతను.

చిన్నపిల్లాడి సంబరం కనిపించింది అతని కన్నుల్లో. ఏ కళాకారుడికైనా తన కళను గుర్చి అడిగినా, మెచ్చుకున్నా కలిగే ఆనందం మాటల్లో చెప్పలేనిది. ఆనాటి నుండి అతను రాసే కవితలన్నీ నాకు వినిపించేవాడు. ఒకోసారి నాకు తోచిన సలహాలు ఇచ్చేదాన్ని. వివిధ ఉర్దూ పత్రికల్లో అతని కవితలు పబ్లిష్ అయ్యేవి.

ఓ రోజు 'ఈ కవిత ఎలా వుందో చూడండి' అంటూ హిందీలో రాసిన పేపర్‌ని ఇచ్చాడు.

చెలీ!
నువు అందని ఆకాశమే
కానీ, అందుకోవాలనే ఆశ నాది
హద్దులున్నాయని తెలుసు
దాటగలవనే నమ్మకం నాది
నా కోసం నువ్వు వస్తే
స్వర్గసీమల్లోకి నిను నడిపిస్తాను
నా జన్మ సార్థకం చేసుకుంటాను
నమ్ము చెలీ!
నేను పుట్టింది నీ కోసమే!

చదివి తలెత్తి అతని వైపు చూశాను. నా ఫీలింగ్స్ గమనిస్తూ... నన్నే చూస్తూ అతను. ఇంతకుముందు ఎన్నడూ కలగని భావం మదిలో చేరి ఉక్కిరిబిక్కిరి చేసింది నన్ను. అతని చూపుల్లో చిక్కుబడిపోయిన చూపుల్ని విడదీసుకుని అక్కడ్నుంచి నా సీటువైపు కదిలాను నేను.

ఎందుకిలా అతని ఆకర్షణలో కూరుకుపోతున్నానో అర్థం కావడం లేదు నాకు. అతని మాట, కదలికా అద్భుతంలా అనిపిస్తున్నాయి. వద్దు అనుకున్నా అతని సమక్షంలో మనసు రెక్కలు కట్టుకుని క్రొత్త లోకాల్లోకి విహరిస్తుంది.


అతన్ని పొందటం అసంభవం అని మనసుకు తెలుస్తున్నా... అయస్కాంతంలా ఆకర్షించే అతని చూపుల ధాటికి నా మనసు బలహీనమవుతోంది. దీనికి ముగింపు ఏమిటి? లేదు... లేదు... జరగదని తెలిసి సమస్యలను క్రియేట్ చేసుకోకూడదు. జీవితాన్ని సమస్యల మయం కానివ్వకూడదు. అవును... అతనితో ఫ్రెండ్లీగా వుండడమే బెటర్. అతని ముందు నా భావాల్ని బయట పడనివ్వకూడదు. ఇలా నిర్ణయించుకున్నాక మనస్సు కాస్త కుదుటపడింది. రిలాక్స్‌డ్‌గా ఛైర్‌లో వెనక్కి వాలి గట్టిగా ఊపిరి పీల్చుకున్నాను. నాన్న గుర్తు వచ్చారు. నా కోసం ఆయన పడ్డ తపన గుర్తుకొచ్చింది.

నేను పుట్టాక అమ్మ చనిపోతే ఆమె జ్ఞాపకాలను మరువలేక దేశాన్ని వదిలి, పుట్టిన గడ్డను వదిలి అమెరికా వచ్చారు నాన్న. మరో వివాహం చేసుకుంటే సవతి తల్లి ఎలా చూస్తుందో అనే సంశయంతో పెళ్ళి విషయం తలపెట్టక నన్ను కంటికి రెప్పలా పెంచి పెద్దచేశారు. ఈ రోజు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఈ కంపెనీలో పనిచేస్తున్నానంటే అది నాన్నగారి ప్రోత్సాహ ఫలితమే.

వయసు పైబడిన నాన్నగారు తొందరలో అమెరికాకు వీడ్కోలు పలికి ఇండియా వెళ్ళి విశ్రాంతి తీసుకుంటూ నా వివాహ ప్రయత్నాలు చెయ్యాలనే ఉద్దేశంలో ఉన్నారు.

అటువంటి నాన్నగారిని వదిలి నా దారిన నేను వెళ్ళిపోగలనా?! ఆలోచిస్తూ కంప్యూటర్ కీబోర్డుపై వేళ్ళని కదిలించాను. నిన్న మిగిలిన వర్క్ కంప్లీట్ చేయాలని.

మరుసటి రోజు పార్కింగ్ ప్లేసులో కారును పార్కుచేసి టైమయిపోయిందనుకుంటూ హడావిడిగా లిఫ్ట్ దగ్గరికి చేరుకున్నాను. లిఫ్ట్ డోర్స్ మూసుకోబోతూ తెరుచుకున్నాయి. ఎదురుగా నవ్వుతూ రహమాన్. ఆ నవ్వులోని సమ్మోహన శక్తి



నన్ను వివశురాలిని చేస్తుంటే... ఓ క్షణం అతనినే చూస్తుండిపోయాను. రండి లోపలికి అన్న అతని మాటకు స్పృహలోనికి వచ్చినదానిలా లిఫ్ట్‌లోకి అడుగుపెట్టాను.

అతని పై నుండి వస్తున్న 'డెనిమ్' సెంట్ పరిమళం హాయిగా మత్తుగా ఉంది. ఎందుకో తలెత్తి సూటిగా అతన్ని చూడలేకపోయాను. హఠాత్తుగా అతను నా చేయిని పట్టుకోవడంతో ఉలిక్కిపడి అతని వైపు చూశాను. "పదండి. మన ఫ్లోర్ వచ్చేసింది" అన్నాడు. తెరచుకున్న లిఫ్ట్ డోర్స్‌ని గమనించక ఆలోచనలో మునిగిపోయినందుకు సిగ్గుపడుతూ... అతని చేతిని మెల్లగా విడిపించుకుని అతని వెనక ఆఫీసులోకి నడిచాను. మృదువైన అతని స్పర్శ నా మదిలో కల్లోలం రేపింది.


నేను నేనేనా? నేను నాలో మిగిలివున్నానా? నా హుందాతనం ఏమయింది? గాంభీర్యం ఏమయింది? అతని స్పర్శకు మైమరచి పోతున్నానేమిటి? సిల్లీగా ప్రవర్తిస్తున్నానా? యస్. ఇక నుండీ ఓ కొలీగ్ లా చూడాలి అతన్ని. అంతే... అలా అని నిశ్చయించుకున్నాక కాస్త కుదుటపడింది మనస్సు.

ఓ రెండు రోజులు ముభావంగా ఉన్నాను నేను. నా ప్రవర్తన అతనికి క్రొత్తగా అనిపించినట్లుంది. ఆ సాయంత్రం "భారతీ! నా కారు ట్రబుల్ ఇచ్చింది. నీ కారులో నన్ను డ్రాప్ చేయవా?" కారును రివర్స్ చేయబోతున్న నేను అతను అడిగినదానికి ఓ.కె. అన్నట్లు తలూపాను. డోర్ తెరిచి నా ప్రక్క సీట్లో కూర్చున్నాడు. ఎందుకింత చనువు పెరిగిపోతోంది మా మధ్య అని ఆలోచిస్తూ డ్రైవ్ చేస్తున్నాను నేను.

"భారతీ! ఈ రోజు ఓ ముఖ్యమైన మెయిల్

## ఓవర్ మేకప్

ప్రియాంకాచోప్రా షూటింగ్‌కు వచ్చే ముందు కిలోల కొద్దీ మేకప్ చేసుకొని వస్తుందట. స్పాట్‌కి వచ్చాక మళ్ళీ మేకప్ చేయించుకుంటుందట. దీనితో హీరోలకు ప్రియాంకతో రొమాంటిక్ సీన్స్‌లో నటించడానికి కష్టంగా ఉంటోంది. ఇలా ప్రియాంకకు ఓవర్ మేకప్ చేసుకునే పిచ్చి ఉందన్నమాట.



పంపాను నీకు. నీ రిప్లయి పాజిటివ్‌గా ఉంటుందని ఆశిస్తున్నాను" అన్నాడు. "ఏమిటది?" అన్నట్లు కనుబొమలెగరేశాను. "మెయిల్ చూసి రిప్లయి ఇవ్వు" నా చేతిని చిన్నగా నొక్కి, వదిలి తన ఫ్లాట్‌లోనికి వెళ్ళిపోయాడు. ఆ నడకలోని హుందాతనాన్ని చూస్తూ ఓ నిముషం అచేతనంగా ఉండిపోయాను నేను.

ఇంట్లోకి రాగానే కంప్యూటర్ దగ్గరికి నడిచి ఇంటర్‌నెట్‌లోనికి ఎంటర్ అయ్యాను. ఇన్‌బాక్స్‌లోని ఉత్తరాలు వరుసగా చూస్తూ ... మెయిల్ ఫ్రమ్ రెహమాన్ అన్నచోట ఆగి మౌస్‌తో క్లిక్ చేశాను. ముందుగా ఓ అందమైన గ్రీటింగ్ కార్డ్. దానిపై 'ఐ లవ్ యూ' అన్న పదం... క్రింద మేటర్.

చదవడం ప్రారంభించాను.

"మై డియర్ భారతీ!

తొలి చూపులో ప్రేమించడం అంటే నిన్ను చూడకముందు నమ్మేవాడిని కాదు. కానీ నిన్ను చూశాక అది నిజమనిపించింది. అందానికి నిర్వచనం నువ్వనిపించింది. ఆ తరువాత గమనించగా - శారీరక అందాన్ని మించిన నీ హృదయ సౌందర్యం అవగతమైంది. నిన్ను పొందని జన్మ నిరర్థకమని భావించాను. అలాగని నిన్ను నా ప్రపోజల్‌కు ఒప్పుకోమని ఒత్తిడి చేయడం లేదు. నీవు ఆలోచించి నిర్ణయం తీసుకో. నీకూ.... నా పట్ల ఇలాంటి భావమే ఉన్నట్లయితే, నా తోడు నీకూ కావాలి అనిపిస్తే నీ కోసం నేను ఎల్లప్పుడూ ఎదురుచూస్తుంటాను. నా కోసం, నీ వాళ్ళను, నీ దేశాన్ని వదిలి రావాలనే విషయం బాధ కలిగించేదే! అందుకే ఆలోచించి నిర్ణయం తీసుకో. నీ కోసం జన్మంతా ఎదురుచూస్తాను. హద్దుల్ని దాటగల ప్రేమ నీలో ఉందనే నా నమ్మకం.

నీ జవాబుకై వేచివున్న

నీ

రహమాన్"



హైదరాబాద్‌లో ప్రముఖ నాట్యాచార్యులు శ్రీ ఏలేశ్వరపు నాగేశ్వర శర్మగారికి 'అభినయ కళానిధి' బిరుదు ప్రదాన కార్యక్రమంలో కూచిపూడి నృత్య ప్రదర్శనకు శ్రీ దైవజ్ఞశర్మ చేతుల మీదుగా మొమెంటో అందుకుంటున్న అనూ అయ్యంగార్

చదివిన నా మెదడు స్తంభించిపోయింది. ఏదో ఒకనాడు ఇలాంటి సమస్య ఎదురవుతుందని తెలుసు. కానీ జవాబు మాత్రం నేను ఆలోచించలేదు. ఏం జవాబివ్వను?

ప్రేమించలేదని చెప్పనా? లేక తండ్రినీ, దేశాన్నీ వదిలి అతని వెంట అతని దేశానికి కదిలి వెళ్ళిపోనా? ఇది అసంభవమే. మరి రహమాన్ లేని జీవితం? ఎందుకింతగా అతనిపై ప్రేమ పెంచుకున్నాను? నిస్సత్తువగా బెడ్‌పై వాలి కళ్ళు మూసుకున్నాను. నాన్న ఎప్పుడు వచ్చారో తెలియదు. "ఏంటమ్మా భారతీ! హెల్త్ బాగలేదా?" బట్టలు కూడా మార్చుకోకుండా అలా పడుకున్నావు" అంటూ ఆప్యాయంగా నుదుటిపై చెయ్యేశారు.

ఇంతవరకు దాచుకున్న విషయాన్ని ఇక చెప్పక తప్పదనిపించింది. 'డాడీ! నీకో విషయం చెప్పాలి' అన్నాను. 'చెప్పు తల్లీ!' అన్నారు.

ఒకోసారి కొన్ని విషయాలు చెప్పాలంటే మాట పెగలదు. ఆ పరిస్థితే నాకూ ఎదురయి నాన్నని కంప్యూటర్ దగ్గరికి తీసుకెళ్ళి రహమాన్ ఇ-మెయిల్ చూపించాను. డాడీ అంతా చదివారు. నా మదిలోని సంఘర్షణ అర్థం చేసుకున్నారు. మౌనంగా ఆలోచిస్తూ ఓ నిముషం ఉండి గదిలో నుండి వెళ్ళిపోయారు. డాడి ఒప్పుకోరని తెలుసు. తెలిసీ ఎందుకింత వరకూ వచ్చాను నేను?!

మరుసటి రోజు ఆఫీసు నుండి వచ్చేటప్పటికి నాన్న రాసిన ఉత్తరం టేబుల్‌పై రెపరెపలాడుతూ కన్పించింది.

తల్లీ భారతీ!

"నువ్వు ఏ నిర్ణయం తీసుకున్నా నాకు సమ్మతమే! సంతోషం మాత్రం కాదు. అయితే ఓ విషయం నువ్వు రహమాన్‌ను మ్యారేజ్ చేసుకుంటే... ఈ తండ్రి శాశ్వతంగా నీకు దూరమవుతాడు. తండ్రినీ దేశాన్నీ కావాలనుకుంటావో, రహమాన్ కావాలనుకుని అతని దేశమైన పాకిస్తాన్‌కు వెళ్ళిపోతావో నిర్ణయించుకోవాల్సింది నీవే.

యాభై సంవత్సరాల పైగా శత్రుత్వం ఉన్న దేశానికి, మూర్ఖులు, అజ్ఞానులు నిండివున్న దేశానికి కోడలుగా వెళతానంటే.... ఆ దేశానికి వారసుల్ని అందిస్తావంటే..... ఏ తండ్రి ఒప్పుకుంటాడు? నీ నిర్ణయం మీదే ఆధారపడి వుంది నీ జీవితం. వ్యక్తిగతంగా రహమాన్ మంచివాడే కావచ్చు. కానీ, అతనితో అతని దేశంలో సంతోషంగా, స్థిమితంగా జీవితాన్ని గడపగలననే నమ్మకం నీలో వుంటే... ఈ నేలను శాశ్వతంగా వదిలి వెళ్ళిపోగలిగితే... నీ ఇష్టం వచ్చినట్లు నిర్ణయం తీసుకో. ఈ రాత్రి నేను ఇండియా వెళ్ళిపోతున్నాను. నా చివరి శ్వాస నా మాతృభూమిపై, తండ్రిపై మమకారంతో నువ్వు 'భారతిగా నా వెనకే వస్తావని ఆశగా నీ కోసం ఎదురుచూస్తుంటాను.

నీ నాన్న"

ఏం చేయను నేను? నన్ను పెంచి పెద్ద చేసిన తండ్రినీ, నా పుట్టిన గడ్డని వదిలి శత్రుదేశానికి కోడలినై సాగిపోగలనా? నెవ్వర్. దేశపు సరిహద్దులు దాటగలనా?!.... ఓ నిముషం ఆలోచించి... ఇంటర్‌నెట్ ఓపెన్ చేసి రిప్లయి కాలమ్‌లో మౌస్ క్లిక్ చేసి రహమాన్‌కు బదులివ్వసాగాను. 'ఐ యామ్ సారీ' అంటూ.

వెంటనే ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు ఫోన్ చేసి ఓ టిక్కెట్ రేపటికి బుక్ చేసుకున్నాను.

నాన్న చూసిన సంబంధం చేసుకుని నాన్న మనసుకు సంతోషం కలిగించాలన్నదే నా ఉద్దేశం.

❀




మీ అభిమాన రచయిత

సూర్యదేవర

రామ్మోహన రావు

ప్రియదత్త సకుటుంబ సచిత్ర వారపత్రిక కోసం

ఇప్పటివరకూ రాసిన రెండు నవలలు

'ప్రేమించని ప్రేయసి'

'బ్లాక్ అండ్ వైట్'

సీరియల్స్‌గా వచ్చాయి

మూడవది

'నువ్వక్కడ - నేనిక్కడ'

ప్రస్తుతం సీరియల్‌గా వస్తోంది

దీని తర్వాత నెంబర్ వన్ నవలా రచయిత
ప్రియదత్త పాఠకుల కోసం రెండు సీరియల్స్ రాస్తున్నారు

ఇతను రేపటిని చూడగలడు

విజేత

ఈ రెంటిలో నాలుగో సీరియల్‌గా
ఏది ప్రారంభం అవుతుందనేది సస్పెన్స్

ఈ సస్పెన్స్ ఒక వారం మాత్రమే